జాబితా ప్రదర్శన

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్ ఒప్పంద ప్రాతిపదికన ఆరోగ్య పథకాల కింద ఖాళీల భర్తీ కోసం ఇటీవల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. అధికారిక వెబ్‌సైట్ jagtialtelangana.gov.inలో ప్రదర్శించారని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. అభ్యర్థులు జాబితా చూసుకొని అభ్యంతరాలుంటే 7వ తేదీ లోగా రాతపూర్వకంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ధరలు తగ్గించాలని వినతి

మెట్‌పల్లిరూరల్: వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద కోడి, మేక మొక్కుతోపాటు తదితర వాటికి వసూలు చేస్తున్న టికెట్ల ధరలను తగ్గించాలని వీడీసీ సభ్యులు డిమాండ్ చేశారు. గతంలో వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగిన ఎల్లమ్మ ఆలయం ఇటీవల దేవదాయ శాఖలో విలీనమైన విషయం తెలిసిందే. దీంతో ఆలయ కార్యకలాపాలు దేవదాయ శాఖ అధికారుల ఆధీనంలోకి వెళ్లాయి. అయితే గతంలో కోడి, మేక, ఇతరత్రా వాటికి వీడీసీ తక్కువ వసూలు చేసిందని, కానీ దేవదాయ శాఖ అధికారులు అంతకన్న ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఆలయ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆలయం వద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. వీడీసీ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

జగిత్యాలరూరల్: జాబితాపూర్ గ్రామానికి చెందిన మారుశెట్టి సూర్యకిరణ్ డిసెంబర్ 24 నుంచి 26 వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన 9వ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించాడు. మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభినందించారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు


మల్యాల: కేక్ కట్ చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు


పెగడపల్లిలోని ఓ బేకరీలో కొనుగోలుదారులు

మల్యాల: మండలంలోని లాస్య ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు సుష్మ మాట్లాడుతూ.. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కరస్పాండెంట్ రాజు పాల్గొన్నారు.

పెగడపల్లి: కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ అన్ని వర్గాల ప్రజలు మంగళవారం అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. వివిధ డిజైన్లు, రుచుల్లో అందుబాటులోకి వచ్చిన కేకులు ఆకర్షణగా నిలిచాయి. అల్లర్లు చోటుచేసుకోకుండా ఎస్సై రవికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు.

పాఠశాలల్లో..

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు యువజన సంఘాల నాయకులు, యువత 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025కి స్వాగతం చెబుతూ ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

జీపీ నిధుల దుర్వినియోగాన్ని పరిశీలించండి

బుగ్గారం: బుగ్గారం గ్రామ పంచాయతీలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక ఉద్యమకారుడు, బుగ్గారం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు. గతంలో జిల్లాస్థాయి అధికారులు విచారణ చేపట్టినప్పటికీ ఫలితం లేదు. దీంతో గంగారెడ్డి లోకాయుక్తలో పలుమార్లు ఫిర్యాదు చేయగా లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తూ తీర్పు ఇచ్చారు. బుగ్గారం జీపీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై వ్యక్తిగత పరిశీలన చేసి అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వ్యక్తిగతంగా పరిశీలించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

శ్లోక స్తుతి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస ఉన్నత పాఠశాలలో శ్లోక స్తుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రజితరావు మాట్లాడుతూ.. మన భారతీయ ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను వెలుగులోకి తెచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గణపతి, లక్ష్మి, వెంకటేశ్వరస్వామి, దేవత శ్లోకాలను విద్యార్థులు పఠించారన్నారు. డైరెక్టర్లు హరిచరణ్‌రావు, మౌనికరావు పాల్గొన్నారు.



సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలలో శ్రీసరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠకు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి రూ.21వేల విరాళం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, సీఆర్పీ దేవారెడ్డి, ఉపాధ్యాయుడు జగన్మోహన్, నాయకులు వాకిటి బుచ్చిరెడ్డి, మారు లింగారెడ్డి, వంగ అశోక్, నిమ్మల విజయ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు సన్మానం

కథలాపూర్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలుగా పని చేసి విరమణ చేసినవారిని మంగళవారం ఐసీడీఎస్ అధికారులు కథలాపూర్‌లో సన్మానించారు. 8 మంది విరమణ పొందారని అధికారులు పేర్కొన్నారు. సీడీపీవో మణెమ్మ, సూపర్‌వైజర్ హైమదిబేగం, అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ అధ్యక్షురాళ్లు శ్రీరాముల సునీత, వనిత, సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

కోరుట్ల: పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మమత మల్టీ స్పెషాలిటీ వైద్యులు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.